


# జమిలికి ఓకే!

మొదటిపేజీ తరువాయి...

అవకాశాలున్నట్టు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు, హైకోర్టు మాజీ న్యాయమూర్తులు, మాజీ ఎన్నికల ప్రధాన కమిషనర్లు సహా 32 పార్టీలు జమిలి ఎన్నికలను సమర్థించినట్టు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా నేతృత్వంలోని ప్యానెల్ వెల్లడించింది. ప్రస్తుత ఎన్డీఏ సర్కారు హయాంలోనే జమిలి ఎన్నికలు నిర్వహిస్తామని అమిత్ షా ఇటీవల స్పష్టంచేశారు. స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగంలోనూ ప్రధాని మోదీ జమిలి గురించి ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ఎన్డీఏ 3.0 సర్కారులోనే జమిలి ఎన్నికలు అమల్లోకి రావొచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.

**కోవింద్ కమిటీ సిఫారసులు ఏమిటంటే?**

- జమిలి ఎన్నికలకు 80 శాతం మంది సానుకూలంగా ఉన్నట్టు మా సర్వేలో స్పష్టమైంది. దీంతో దేశంలో ఏకకాల ఎన్నికలను ప్రతిపాదిస్తున్నాం. 1951-1967 మధ్య దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు జరిగాయి.
- ఐదేండ్లలో లోక్‌సభకు, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని 1999లో లా కమిషన్ తన 170వ నివేదికలో సిఫారసు చేసింది.
- జమిలి ఎన్నికలను రెండు దఫాల్లో ఒకేసారి నిర్వహించాలని 2015లో పార్లమెంటరీ కమిటీ తన 79వ నివేదికలో సిఫారసు చేసింది.
- పై విషయాలను క్రోడీకరించి.. జమిలి ఎన్నికలను రెండు దఫాల్లో 100 రోజుల ఎడంతో నిర్వహించాలని సిఫారసు చేస్తున్నాం.
- తొలిదఫాలో లోక్‌సభతో పాటు అన్నిరాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించాలి.
- సాధారణ ఎన్నికలు ముగిసిన 100 రోజుల్లోగా పంచాయతీ, మునిసిపాలిటీ వంటి స్థానిక సంస్థల ఎన్నికలను రెండో దఫాలో నిర్వహించాలి.
- పై అన్ని ఎన్నికలకు కామన్ ఎలక్టోరల్ రోల్‌ను అనుసరించాలి.

## ఏయే దేశాల్లో ఏక కాల ఎన్నికలు

ప్రపంచంలోని 194 దేశాల్లో ప్రస్తుతం పది దేశాల్లో మాత్రమే జమిలి ఎన్నికల విధానం అమల్లో ఉన్నది. అయితే, ఈ అన్ని దేశాల జనాభా.. భారత దేశ జనాభాలో 34 శాతం కూడా లేదు. జమిలి ఎన్నికలు నిర్వహిస్తున్న చాలా వరకు దేశాల్లో అధ్యక్ష తరహా పాలన కొనసాగుతుండటం గమనార్హం.

**ప్రపంచవ్యాప్తంగా జమిలి ఎన్నికల నిర్వహణ ఇలా..**

- 50వ దశకంలో జమిలి ఎన్నికలు నిర్వహించిన దేశాలు- 60
- ప్రస్తుతం జమిలి ఎన్నికలు కొనసాగుతున్న దేశాలు 10. ( స్వీడన్, ఇండోనేషియా, దక్షిణాఫ్రికా, జర్మనీ, స్పెయిన్, హంగరీ, బెల్జియం, స్లొవేనియా,అల్బేనియా, పోలండ్)

## సిఫారసులు ఇప్పటివి కాదు!

జమిలి ఎన్నికల నిర్వహణపై సిఫారసులు, కమిటీల ఏర్పాటు ఈనాటిది కాదు. 1983లో నాటి ఎన్నికల సంఘం చట్టసభలకు ఒకేసారి ఎన్నికలు జరుపాలని ప్రతిపాదించింది. 1999లో లా కమిషన్ ఇదే సూచన చేసింది. 2015లో పార్లమెంటరీ కమిటీ జమిలి ఎన్నికలకు సానుకూలత వ్యక్తం చేసింది. జమిలి ఎన్నికల నిర్వహణకు సంబంధించి 2016 తర్వాత కూడా పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, లా కమిషన్, నీతిఆయోగ్ పలు కమిటీలుగా ఏర్పడి 'ఒకే దేశం-ఒకే ఎన్నికల'కు అనుకూలంగా నివేదికలు ఇచ్చాయి. ప్రస్తుతం కేంద్రం నిర్ణయించిన కోవింద్ కమిటీ నాలుగవది.

# జమిలి సాధ్యమా?

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): 'ఒకే దేశం-ఒకే ఎన్నికలు' (జమిలి ఎన్నికలు) నిర్వహణకు కోవింద్ కమిటీ సానుకూల నివేదికను ఇవ్వడంతో త్వరలోనే దీనిపై పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని ఎన్డీఏ ప్రభుత్వం భావిస్తున్నది. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో జమిలి ఎన్నికలు సాధ్యమా? ఒకవేళ ఈ ఎన్నికలు నిర్వహించాలంటే ఏయే ప్రొసీడింగ్స్‌ను అనుసరించాల్సి ఉంటుందన్న దానిపై పెద్దయెత్తున చర్చ జరుగుతున్నది.

- ఏకకాల ఎన్నికలకు లాజిస్టిక్స్ సమస్య
- 18 రాజ్యాంగ సవరణలు చేయాల్సిందే
- జమిలి ఎన్నికలకు దూరంగా పలు దేశాలు
- లాభాల కంటే నష్టాలే ఎక్కువ: నిపుణులు




**ఏమిటీ జమిలి ఎన్నికలు?**

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలను నిర్వహించడమే జమిలి ఎన్నికల ప్రధాన ఉద్దేశం.

**గతంలో జరిగినా.. ఆ తర్వాత**

వాస్తవానికి మన దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణ కొత్తదేమీ కాదు. 1952లో తొలి సాధారణ ఎన్నికలు మొదలుకొని, 1967 వరకు లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు చాలా వరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే అనంతర కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసనసభలను బర్తరఫ్ చేయడం తదితర కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరుపడం మొదలైంది.

**ప్రక్రియ పెద్దదే**

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలంటే చాలా రాష్ట్రాలు చట్టసభలను గడువు కంటే ముందే రద్దుచేయాల్సి ఉంటుంది. మరికొన్నింటి కాలవ్యవధిని పొడిగించాల్సిన అవసరమూ ఉండొచ్చు. కాబట్టి, జమిలి ఎన్నికలను నిర్వహించాలంటే దానికి సంబంధించిన బిల్లు తొలుత పార్లమెంట్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. జమిలి ఎన్నికలు జరుగాలంటే దాదాపు 18 రాజ్యాంగ సవరణలు, ప్రజా ప్రాతినిధ్య చట్టంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉన్నదని కోవింద్ కమిటీ తాజా నివేదికలో స్పష్టం చేసింది. ముఖ్యంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 356, ఆర్టికల్ 324, ఆర్టికల్ 83(2), ఆర్టికల్ 172(1), ఆర్టికల్ 83కు సంబంధించి పలు సవరణలు అవసరమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### ఉభయ సభల్లో ఎన్డీఏ బలాబలాలు

| | |
|---|---|
| లోక్‌సభలో ఎన్డీఏ బలం | 293 |
| జమిలి బిల్లు ఆమోదానికి కావాల్సిన బలం | 362 |
| రాజ్యసభలో ఎన్డీఏ బలం | 121 |
| జమిలి బిల్లు ఆమోదానికి కావాల్సిన బలం | 164 |
| ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న రాష్ట్రాలు | 19 |
| బిల్లు ఆమోదానికి ఎన్ని రాష్ట్రాల ఆమోదం అవసరం | 14 |

**ఏ ఆర్టికల్/నిబంధన ఏం చెబుతున్నది?**

ఆర్టికల్ 356: రాష్ట్రాల అసెంబ్లీలను రద్దుచేసే అధికారం కేంద్రానికి ఉన్నది. రాష్ట్రంలో రాజ్యాంగబద్ధ యంత్రాంగం విఫలమైనప్పుడు మాత్రమే ఈ ఆర్టికల్‌ను ఉపయోగించి కేంద్రం ఈ చర్యకు దిగాల్సి ఉంటుంది. ఒకవేళ, వేరే సందర్భంలో చట్టసభ రద్దుకు నిర్ణయిస్తే, అది రాజ్యాంగ విరుద్ధమే అనిపించుకొంటుంది.

- **ఆర్టికల్ 172 (1):** అసెంబ్లీ కాలవ్యవధి ఐదేండ్లుగా కొనసాగుతుంది. అత్యయిక స్థితిలో తప్పించి అసెంబ్లీ కాలవ్యవధిని మరే ఇతర సందర్భాల్లో పొడిగించకూడదు. సభ తొలిసారిగా సమావేశమైన నాటినుంచి కాలపరిమితి మొదలౌతుంది.
- **ఆర్టికల్ 324:** రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, లోక్‌సభ, రాజ్యసభ, శాసనసభ, శాసన మండలి ఎన్నికలు కేంద్ర ఎన్నికల సంఘం పర్యవేక్షణలో జరుగుతాయి. సమయానుసారం, రాజ్యాంగ నిబంధనలకు లోబడి ఈ ఎన్నికలు జరుగుతాయి. పార్లమెంట్, శాసనసభ ఎన్నికలు ఒకేసారి నిర్వహించాలంటే చట్టసభ కాలవ్యవధిని సహేతుక కారణాలతో సవరించాల్సి ఉంటుంది.
- **ఆర్టికల్ 83(2):** ప్రజాతీర్పుతో కొలువుదీరిన లోక్‌సభ కాలవ్యవధి ఐదేండ్లు. ప్రత్యేక సందర్భాల్లో మినహాయించి దిగువ సభను రద్దు చేయడానికి వీలు లేదు.
- **ఆర్టికల్ 83:** పెద్దల సభ కాలపరిమితికి సంబంధించి ఆర్టికల్ 83 సూచిస్తుంది. దీంతో పాటు రాజ్యాంగంలోని 2,3 చాప్టర్స్, పార్ట్-15లోని పలు అంశాలను, ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని కొన్ని నిబంధనలు కలిపి మొత్తం 18 అంశాలను జమిలి బిల్లు కోసం సవరించాల్సి ఉంటుంది.

### దేశంలో జమిలి ఎన్నికలు సాగాయిలా..

| సంవత్సరం | జమిలి ఎన్నికలు |
|---|---|
| 1951-52 | 90 శాతం |
| 1957 | 76 శాతం |
| 1967 | 67 శాతం |
| 2019 | 15 శాతం |
| 2024 | 15 శాతం |

**ఆమోదం లభించడం సులభమేమీ కాదు**

జమిలి ఎన్నికలకు సంబంధించి రాజ్యాంగ సవరణలతో కూడిన బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు కనీసం 67 శాతం సానుకూల ఓట్లతో ఆమోదించాల్సి ఉంటుంది. అంతేకాకుండా.. ఎన్నికల అంశం ఉమ్మడి జాబితాలో ఉన్న నేపథ్యంలో ఈ బిల్లుకు దేశంలోని కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోద ముద్రవేయాలి. అంటే 543 స్థానాలున్న లోక్‌సభలో కనీసం 67 శాతం (362 ఎంపీలు) మంది ఈ బిల్లుకు అనుకూలంగా ఓటువేయాలి. దీంతోపాటు రాజ్యసభలో 245 సీట్లలో 67 శాతం (164 ఎంపీలు) ఈ బిల్లును సమర్థించాలి. దీనికి తోడు కనీసం 14 రాష్ట్రాల అసెంబ్లీలు బిల్లును ఆమోదించాల్సిన అవసరం ఉన్నది.

## లా కమిషన్ 'జర్మనీ' ఉదాహరణ

రాజ్యాంగంలో అవిశ్వాస తీర్మానం ప్రస్తావన కచ్చితత్వంతో లేదు. లోక్‌సభ విధివిధానాల్లోని 198వ నిబంధనలో మాత్రమే దాన్ని ప్రస్తావించారు. 50 లేదా అంతకంటే ఎక్కువమంది చట్టసభ సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టవచ్చని నిబంధనలు చెబుతున్నాయి. అవిశ్వాస తీర్మానం నెగ్గితే ప్రభుత్వం గద్దె దిగాల్సి ఉంటుంది. ఏ వర్గమూ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే స్థితిలో లేనప్పుడు సభను రద్దుచేసి మధ్యంతర ఎన్నికలు జరుపడమే మార్గం. మరి అలాంటి సమస్య తలెత్తకుండా ఉండాలంటే ఏం చేయాలి? దీనిపై 1999లో లా కమిషన్ ఓ సిఫారసు చేసింది. ఈ మేరకు జర్మనీ రాజ్యాంగాన్ని ఉదహరించింది. దాని ప్రకారం.. జర్మనీలో అవిశ్వాస తీర్మానంతో పాటు విశ్వాస తీర్మానం కూడా ప్రవేశపెడతారు. అంటే, ప్రభుత్వంపై అవిశ్వాసం ప్రకటించేవారు ఎవరు నెగ్గుతారో కూడా చెప్పాలి. ఈ రెండు తీర్మానాలను సభ ఆమోదించిన తర్వాత అధ్యక్షుడు కొత్త చాన్సలర్‌ను నియమిస్తారు. ప్రభుత్వాలు మారినా ఐదేండ్లపాటు సభ కొనసాగుతుంది. అయితే, జర్మనీలో అధ్యక్ష పాలన అమల్లో ఉన్నది. మనది ప్రజాస్వామ్య దేశం. దీంతో ఈ సిఫారసును పక్కనబెట్టారు.

## లాజిస్టిక్స్ సమస్య

జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే లాజిస్టిక్స్ సమస్య అడ్డంకిగా మారుతున్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు. ఈవీఎం యంత్రాలతో పాటు వందశాతం వీవీప్యాట్స్ అందుబాటులో ఉంచడం అనేది పెద్ద సమస్యని అంటున్నారు. ఎన్నికల సామగ్రిని భద్రపరుచడానికి తగినన్ని గోదాములు కూడా సమస్యగా మారింది. 15 ఏండ్లకోసారి ఈవీఎంలను మార్చాల్సి ఉంది. ఈవీఎంలలో 40% వరకు డెడ్‌లైన్ దాటినవేనని నిపుణులు చెబుతున్నారు. ఉదాహరణకు 2009 లోక్‌సభ ఎన్నికలకు రూ. 1,115 కోట్లు, 2014లో రూ. 3,870 కోట్లు ఖర్చు కాగా 2019లో ఈ ఖర్చు పది వేల కోట్ల రూపాయలకు పెరిగినట్లు అంచనా. ఇక శాసనసభ ఎన్నికల నిర్వహణను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఒక్కొక్క రాష్ట్రానికి రూ. 250 కోట్లు ఖర్చవుతుందనుకుంటే, మొత్తం 28 రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభ ఎన్నికలకు, స్థానిక సంస్థల ఎన్నికలకు కలిపి అయ్యే ఖర్చు పెద్దమొత్తంలో ఉంటుందని, ఇది సాధ్యమయ్యే పనికాదని పలువురు చెప్తున్నారు.

### ఏకకాల ఎన్నికలు జరగాలంటే?

| లాజిస్టిక్స్/మానవ వనరులు | అవసరం | ప్రస్తుత సామర్థ్యం |
|---|---|---|
| ఈవీఎంలు | 25 లక్షలు | 12 లక్షలు |
| వీవీప్యాట్ యంత్రాలు | 25 లక్షలు | 12 లక్షలు |
| కేంద్ర బలగాల కంపెనీలు | 6000 | 1350 |
| పర్యవేక్షకులు | 50000000 | 10000000 |

## ప్రజాధనం ఆదా.. అభివృద్ధికి ఊతం

### జమిలిని స్వాగతించిన బీజేపీ, మిత్రపక్షాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18: ఎన్డీఏలోని బీజేపీ సహా ఇతర మిత్రపక్షాలన్నీ జమిలి ఎన్నికలపై కేంద్ర క్యాబినెట్ నిర్ణయాన్ని ఆహ్వానించాయి. తెలుగుదేశం, జనతాదళ్ (యునైటెడ్), ఎల్జేపీ (రామ్ విలాస్), జేడీఎస్, శివసేన (షిండే వర్గం) పార్టీలు కేంద్ర క్యాబినెట్ నిర్ణయాన్ని సమర్థించాయి. జమిలి ఎన్నికలతో ప్రజాధనం ఆదా అవుతుందని, అభివృద్ధి వేగవంతమవుతుందని పేర్కొన్నాయి. ఇది దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తీసుకున్న అతిపెద్ద నిర్ణయంగా ఎల్జేపీ అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ అభిప్రాయపడ్డారు. దేశం తరుచూ ఎన్నికల్లో కూరుకుపోకుండా ఇది అడ్డుకుంటుందని జేడీయూ అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ అన్నారు. ఇది చారిత్రక అడుగుగా కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామి పేర్కొన్నారు. కేంద్ర క్యాబినెట్ నిర్ణయం దేశానికి ఓ గేమ్ చేంజర్‌గా మారుతుందని శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే చెప్పారు.

## చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం దిశగా ముందడుగు

### ఏకకాల ఎన్నికలపై ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18: జమిలి ఎన్నికలపై కేంద్ర క్యాబినెట్ నిర్ణయం.. భారత ప్రజాస్వామ్యాన్ని మరింత చైతన్యవంతం చేయటంలో, ప్రాతినిధ్యాన్ని పెంచటంలో కీలకమైన ముందడుగా ప్రధాని మోదీ అభివర్ణించారు. 'దేశంలో ఏకకాల ఎన్నికలకు సంబంధించి అత్యున్నత స్థాయి కమిటీ సిఫారసులకు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. వివిధ వర్గాలతో విస్తృతంగా చర్చలు జరిపి నివేదికను అందజేసిన మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌గారికి అభినందనలు తెలుపుతున్నా' అంటూ ప్రధాని మోదీ 'ఎక్స్'లో తన సందేశాన్ని పోస్ట్ చేశారు.

# కేంద్రం స్పష్టత ఇవ్వాలి

### జమిలిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): జమిలి ఎన్నికల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఏ విధంగా ముందుకు వెళ్తుందో స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ సూచించారు. తెలంగాణ భవన్‌లో బీసీల సమావేశం అనంతరం జమిలి ఎన్నికలపై మీడియా అడిగిన ఒక ప్రశ్నకు కేటీఆర్ స్పందిస్తూ, జమిలి ఎన్నికలను ఏ విధంగా నిర్వహించబోతుందో మరిన్ని వివరాలు ఇవ్వాలని, కేంద్రం తన వైఖరిని విడమర్చి స్పష్టత ఇవ్వాలని కోరారు. మూడు నెలల క్రితమే పార్లమెంట్‌కు ఎన్నికలు జరిగాయని, జమిలి ఎన్నికల అంటే అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు రద్దు చేసి ఎన్నికలు తీసుకువస్తారా? దశల వారిగా తీసుకువస్తారా? వచ్చే జనవరి, ఫిబ్రవరిలో ఐదు రాష్ట్రాలకు ఎన్నికలు జరగనున్నాయని, వీటన్నింటిపై ఏ విధంగా చేస్తారో చెప్పాల్సి ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు మరో ఐదేండ్ల సమయముందని, వీటి టర్మ్‌లపై ఏం చేయబోతున్నారనే దానిపై కేంద్రం స్పష్టత ఇవ్వాలన్నారు. జనాభా లెక్కలతో పాటు సీట్ల పునర్విభజన జరగాల్సి ఉందని, మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాల్సి ఉందన్నారు. వీటిపై కేంద్రం స్పష్టత ఇస్తే .. బీఆర్‌ఎస్ కూడా జమిలి ఎన్నికలపై ఒక నిర్ణయం తీసుకుంటుందని కేటీఆర్ తెలిపారు.

## అసాధ్యం.. చౌకబారు ఎత్తుగడ

### ఏకకాల ఎన్నికలపై విపక్షాల విమర్శలు

న్యూఢిల్లీ : కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన జమిలి ఎన్నికల ప్రతిపాదనను విపక్షాలు బుధవారం వ్యతిరేకించాయి. ఈ ప్రతిపాదన ఆచరణలో అసాధ్యమని, కేంద్ర ప్రభుత్వపు చౌకబారు ఎత్తుగడ అని విమర్శించాయి. 'ఎన్నికలు వచ్చినప్పుడు లేవనెత్తడానికి వారికి(బీజేపీ) ఏ అంశం ఉండదు. అసలైన సమస్యల నుంచి వాళ్ల దృష్టి మళ్లిస్తారు' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు.జమిలి ఎన్నికలు సమాఖ్య వాదాన్ని ధ్వంసం చేస్తాయని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. 'ప్రజాస్వామ్య వ్యతిరేకి అయిన బీజేపీ మరొక చౌకబారు ఎత్తుగడ' అని టీఎంసీ నాయకుడు డెరెక్ ఓబ్రియాన్ అన్నారు.

## 'జమిలి'పై బీజేపీ పట్టు ఎందుకు?

జమిలి ఎన్నికలు నిర్వహిస్తే.. 77 శాతం మంది ప్రజలు ఒకే పార్టీ లేదా కూటమిని ఎన్నుకునే అవకాశాలున్నాయని పబ్లిక్ పాలసీ మేధో సంస్థ ఐడీఎఫ్‌సీ వివిధ సందర్భాల్లో చేసిన సర్వేల్లో తేలింది. అదే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఆరు నెలల ఎడంతో నిర్వహిస్తే ఒకే పార్టీని ఎన్నుకొనే అవకాశాలు 61శాతానికి తగ్గిపోతాయని ఆ సర్వే పేర్కొంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఏడాది ఎడంతో జరిగితే ప్రభావం మరింతగా తగ్గొచ్చని వెల్లడించింది. 1952 నుంచి 2019 వరకు జరిగిన సాధారణ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సరళిని విశ్లేషించి ఈ రిపోర్టును తయారుచేసింది. జమిలి ఎన్నికల్లో జాతీయ అంశాల ఆధారంగా.. అసెంబ్లీకి ఓటేసే అవకాశమున్నదని, దీంతో ప్రాంతీయ పార్టీలు ఎన్నికల్లో దెబ్బతినే ప్రమాదమున్నదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అనుకొన్న ఫలితాలు రాలేదు. ఈ క్రమంలోనే ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా సహా ఆ పార్టీ నేతలు జమిలి ఎన్నికల నిర్వహణకు పట్టుబడుతున్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు.

# లాభాలేంటి? నష్టాలేంటి?

**లాభాలు**

- తరచూ వచ్చే ఎన్నికల కోడ్ వంటి అడ్డంకులు తప్పడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వాలు దృష్టి సారించవచ్చు.
- ఎన్నికల వ్యయం, సిబ్బంది వినియోగం, నిర్వహణ భారం తగ్గుతుంది.
- ఓటింగ్ శాతం పెరుగుతుంది.
- ఒకేసారి ఎన్నికల నిర్వహణతో ఓటు వేయడానికి ప్రజలు తరుచూ వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఉత్పాదకత పెరుగుతుంది.



**నష్టాలు**

- భారత్ వంటి అత్యధిక జనాభా కలిగిన దేశంలో ఒకేసారి ఎన్నికలు కష్టం. పారదర్శకతపై అనుమానాలు కలుగొచ్చు.
- జమిలిపై రాజ్యాంగంలో ప్రస్తావన లేదు కాబట్టి, ఇప్పటికైతే ఇది రాజ్యాంగ విరుద్ధం.
- గడువులోపే ప్రభుత్వాలు పడిపోతే జమిలి లక్ష్యమే దెబ్బతింటుంది. అవిశ్వాసం ఎదుర్కొనే ప్రభుత్వాల విషయంలోనూ ఇది జరుగొచ్చు.
- జమిలితో జాతీయ పార్టీలకు మేలు జరుగొచ్చు. జాతీయ అంశాల ఆధారంగా అసెంబ్లీకి కూడా ప్రజలు ఓటేస్తే, ప్రాంతీయ పార్టీలు ఎన్నికల్లో దెబ్బతినే ప్రమాదం ఉన్నది.
- జమిలి నిర్వహణకు భారీగా సిబ్బంది, ఈవీఎంలు, వీవీప్యాట్లు అవసరం.

## సమాఖ్య స్ఫూర్తికి ప్రమాదం..!

కేంద్ర, రాష్ట్ర చట్టసభలకు, ఇంకా అవసరమైతే స్థానిక సంస్థలకు జమిలి ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచన పైకి మంచిగానే కనబడుతున్నప్పటికీ, లోతుగా విశ్లేషిస్తే, ప్రజాస్వామ్య విలువలు, సమాఖ్యస్ఫూర్తికి ప్రమాదం వాటిల్లే అవకాశాలు ఉన్నట్టు పలువురు రాజకీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'ఐదేండ్ల కాలానికి ఎన్నికైన ఏదైనా ప్రభుత్వం మధ్యలో కూలిపోతే ఏమి చేయడం? అక్కడ మళ్లీ ఎన్నికలు నిర్వహిస్తే కొత్త ప్రభుత్వం ఐదేండ్ల కాలానికి అధికారం చేపడుతుంది. అప్పుడు ఉమ్మడి ఎన్నికల వ్యవస్థ (జమిలి) లక్ష్యం దెబ్బతింటుంది. ఇలా జరుగకుండా ఉండాలంటే, కొత్త ప్రభుత్వం కాలపరిమితిని కుదించాల్సి ఉంటుంది. ఇది ప్రజాతీర్పుకు, సమాఖ్యస్ఫూర్తికి, ప్రజాస్వామ్య విలువలకు గొడ్డలి పెట్టులాంటిదే' అని వాళ్లు వాదిస్తున్నారు.

## రోజూ కాఫీ తాగితే గుండె జబ్బులు దూరం!

న్యూఢిల్లీ: రోజుకు మూడు కప్పుల కాఫీ తాగిన వాళ్లలో జీవన శైలి సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం తక్కువగా ఉంటున్నదని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. డయాబెటిస్, గుండె సమస్యల బారిన పడే ముప్పు 40 నుంచి 50శాతం వరకు తగ్గుతుందని తెలిపింది. రోజూ కాఫీ, టీ తాగిన 1.88 లక్షల మంది డాటాను చైనాకు చెందిన సుజో మెడికల్ కాలేజీ సైంటిస్టులు విశ్లేషించారు. రోజుకు మూడు కప్పుల కాఫీ తీసుకున్న వాళ్లలో గుండెపోటు, హై బీపీ, మధుమేహం.. మొదలైన సమస్యల ముప్పు తగ్గినట్టు పరిశోధకులు గుర్తించారు.

## మలప్పురంలో ఓ వ్యక్తికి మంకీపాక్స్ నిర్ధారణ

తిరువనంతపురం, సెప్టెంబర్ 18: కేరళలోని మలప్పురంలో ఓ వ్యక్తికి మంకీపాక్స్ నిర్ధారణ అయింది. తొలుత అనుమానిత కేసుగా గుర్తించిన వైద్య వర్గాలు, సదరు పేషెంట్ మంకీపాక్స్ బారిన పడ్డాడని తాజాగా నిర్ధారించారు. బుధవారం ఈ మేరకు కేరళ ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ 'ఫేస్‌బుక్'లో తెలిపారు. ఎంపాక్స్ సోకిన వ్యక్తి ఇటీవలే దుబాయ్ నుంచి కేరళకు వచ్చాడని మంత్రి చెప్పారు. ప్రస్తుతం అతడికి మలప్పురంలోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. ఆఫ్రికా దేశాల్లో ఎంపాక్స్ కేసులు పెద్ద ఎత్తున నమోదుకావటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలు జారీ చేసింది.

## జమ్ముకశ్మీర్ తొలి దశలో 59% పోలింగ్

జమ్ము: జమ్ముకశ్మీర్ తొలి దశ ఎన్నికల్లో రికార్డు స్థాయి పోలింగ్ నమోదైంది. మునుపెన్నడూ లేనంతగా.. ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో విస్తరించిన 24 అసెంబ్లీ స్థానాలకు బుధవారం పోలింగ్ నిర్వహించగా, 59 శాతం ఓటింగ్ నమోదైందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) పీకే పోలి మీడియాకు తెలిపారు. కిష్ట్‌వార్ జిల్లాలో అత్యధికంగా 77శాతం, పుల్వామాలో అత్యల్పంగా 46శాతం పోలింగ్ నమోదైనట్టు చెప్పారు.

# చంద్రయాన్-4కు గ్రీన్‌సిగ్నల్

- శుక్రయాన్-1 మిషన్‌కూ పచ్చజెండా
- ఎన్జీఎల్వీ అభివృద్ధికి సైతం ఆమోదం
- రబీ ఎరువుల సబ్సిడీకి 24 వేల కోట్లు
- 35 వేల కోట్లతో పీఎం ఆశా కొనసాగింపు
- గిరిజనుల అభివృద్ధికి 79 వేల కోట్లు
- కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18: చంద్రుడిపైకి భారతీయ వ్యోమగాములను పంపేందుకు అవసరమైన సాంకేతికతల అభివృద్ధి, ప్రదర్శన కోసం చేపట్టనున్న 'చంద్రయాన్-4' మిషన్‌కు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. ఇందుకు రూ.2,104.06 కోట్లు కేటాయించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో సమావేశమైన మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. శుక్రగ్రహాన్ని అధ్యయనం చేయడం కోసం దాని కక్ష్యలోకి వ్యోమనౌకను పంపించేందుకు చేపట్టనున్న 'వీనస్ ఆర్బిటర్ మిషన్'(శుక్రయాన్-1)కు రూ.1,236 కోట్లు కేటాయించింది. పాక్షిక పునర్వినియోగానికి అవకాశం ఉండే నెక్స్ట్ జెనరేషన్ లాంచ్ వెహికిల్(ఎన్జీఎల్వీ)కి సైతం క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 2035 నాటికి భారతీయ అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంలో భాగంగా కీలకమైన ఎన్జీఎల్వీతో పాటు మూడు డెవలప్‌మెంటల్ విమానాలు, ఇతర అవసరమైన సాంకేతికత అభివృద్ధి కోసం రూ.8,240 కోట్లు కేటాయించింది.

**గిరిజనుల కోసం కొత్త పథకం**

దేశవ్యాప్తంగా గిరిజనుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చేందుకు గానూ రూ.79,156 కోట్ల వ్యయంతో ప్రధాన మంత్రి జనజాతీయ ఉన్నత్ గ్రామ అభియాన్ పథకం అమలు చేసేందుకు మంత్రివర్గం ఆమోదించింది. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ(ఏవీజీసీ-ఎక్స్‌ఆర్) కోసం నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్(ఎన్‌సీఓఈ)ను ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలిపింది. 2024-25 రబీ సీజన్‌కు ఫాస్ఫాటిక్, పొటాసిక్(పీ అండ్ కే) ఎరువుల సబ్సిడీగా రూ.24,474.53 కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. రైతుల పంటలకు మెరుగైన ధరలు అందేలా చూసేందుకు, నిత్యావసరాల ధరలు స్థిరంగా ఉంచేందుకు రూ.35,000 కోట్ల వ్యయంతో పీఎం-ఆశా పథకాన్ని 2025-26 వరకు కొనసాగించాలని నిర్ణయించింది. జీవసాంకేతిక విజ్ఞానంలో అధునాతన పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించేందుకు రూ.9,197 కోట్ల వ్యయంతో బయోటెక్నాలజీ రిసెర్చ్ ఇన్నొవేషన్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్(బయో-రైడ్) పథకాన్ని ప్రారంభించాలని మంత్రివర్గం నిర్ణయించింది.

**చంద్రయాన్-4 లక్ష్యమేంటి?**

చంద్రయాన్-3 విజయంతో ఉత్సాహంగా ఉన్న ఇస్రో 2040 నాటికి చంద్రుడి పైకి భారతీయ వ్యోమగాములను పంపి, సురక్షితంగా తిరిగి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందుకు అవసరమైన సాంకేతికతలను దేశీయంగానే అభివృద్ధి చేసి, ప్రదర్శించడమే చంద్రయాన్-4 మిషన్ లక్ష్యం. 36 నెలల కాలంలో ఈ మిషన్‌ను పూర్తి చేయాలని ఇస్రో భావిస్తున్నది. ఇందులో భాగంగా ఇస్రో స్వయంగా వ్యోమనౌకను అభివృద్ధి చేసి, ప్రయోగించనున్నది. ఇప్పటికే చంద్రయాన్-3 ద్వారా చంద్రుడిపై సురక్షితంగా ల్యాండ్ అవగలిగే సాంకేతికతను ప్రదర్శించామని, చంద్రయాన్-4 ద్వారా వ్యోమగాములను సురక్షితంగా తిరిగి తీసుకురావడం కీలక లక్ష్యమని ఇస్రో చైర్మన్ సోమ్‌నాథ్ తెలిపారు.

**శుక్రగ్రహ అన్వేషణకు శుక్రయాన్-1**

భూమికి అతి సమీపంలో ఉండే గ్రహమైన శుక్రుడిపై అన్వేషణ కోసం ఇస్రో శుక్రయాన్-1(వీనస్ ఆర్బిటర్ మిషన్) చేపట్టనుంది. శుక్రగ్రహం సైతం భూమి లాగానే ఏర్పడిందని భావిస్తున్న శాస్త్రవేత్తలకు, ఈ గ్రహంపై భూమికి భిన్నంగా 450 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలు ఎలా నమోదవుతున్నాయో అంతుచిక్కడం లేదు. ఈ నేపథ్యంలో వ్యోమనౌకను శుక్రగ్రహ కక్ష్యలోకి పంపించి, ఈ గ్రహం ఉపరితలం, క్లిష్టమైన వాతావరణ పరిస్థితులపై అధ్యయనం చేయడమే శుక్రయాన్-1 లక్ష్యం. 2028 మార్చిలో ఈ ప్రయోగం చేపట్టాలని ఇస్రో భావిస్తున్నది.